రాష్ట్రానికి గొప్ప పేరు తేవాలి

మంత్రి బొత్స సత్యనారాయణ విద్యార్థులకు పిలుపు

చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాల కొత్త భవనం ప్రారంభం

రెండు కొత్త కోర్సులు, అదనపు వసతులు

విశాలాంధ్ర-చీపురుపల్లి: విద్యార్థులు బాగా చదువుకొని రాష్ట్రానికి, తల్లి తండ్రులకు గొప్ప పేరుతేవాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. కేజీ నుంచి పీజీవరకు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రభుత్వం రాష్ట్రంలో అత్యున్నత విద్యను అందిస్తోందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన చీపురుపల్లి జి.బి.ఆర్. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసం జరుగుతున్న సమయంలోనే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. అభివృద్ధి చెందాలనే తపన ముఖ్యమని ఆయన స్పష్టంచేశారు. ప్రస్తుతం కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు మాత్రమే ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్, సివిల్ కోర్సులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే కళాశాలను అదనపు ఫ్యాకల్టీ, ఆఫీస్ స్టాఫ్, హాస్టల్ మంజూరు చేస్తా మని, క్యాంపస్ రిక్రూట్మెంట్ సౌకర్యాన్ని పెంచుతామని చెప్పారు. ఇకనుంచి ప్రతీ ఆరు నెలలకు ఒకసారి కళాశాలకు వచ్చి విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటానని అన్నారు.

ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, కళాశాల చరిత్ర, అభివృద్ధి చెందిన విధానాన్ని వివరించారు. మంత్రి బొత్స సత్యనారాయణ కృషితో ఈ కళాశాల ఎంతగానో అభివృద్ధి చెందిందని అన్నారు. తన ఎంపి నిధులు రూ.10 లక్షలతో కళాశాల ప్రాంగణంలో అథ్లెటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, సాంకేతిక నిపుణులకు అపార ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. ఐటీఐ, పాలిటెక్నిక్ చదివినవారికి ఎంతో డిమాండ్ ఉందని అన్నారు. కోర్సు పూర్తి అయిన వెంటనే, క్యాంపస్ సెలక్షన్లో వచ్చిన ఉద్యోగంలో చేరిపోవాలని, ఆ తరువాత మరిన్ని మంచి అవకాశాలు లభిస్తాయని సూచించారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, ఎంపిపి ప్రతినిధి ఇప్పిలి అనంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, పలువురు విద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్జేడీ. సత్యనారాయణ మూర్తి, ఆర్డీవో బి.శాంతి, ఎంపిపి. ఐ.వెంకట నరసమ్మ, జెడ్పీటీసీ వి.శిరీష, తాసిల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీఓ డి.శ్వేత, ఇతర అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకున్న వారందరికీ కుళాయి కనెక్షన్లు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కులాయి కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కనెక్షన్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కె.ఎల్.పురం వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం కుళాయి కనెక్షన్ల కోసం డిప్యూటీ స్పీకర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. కె.ఎల్ పురం, రెవిన్యూ కాలని లకు చెందిన 70మంది లబ్ధిదారులు కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తులు సమర్పించారు. స్వయంగా కోలగట్ల గారే లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ అందరికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని, పైప్ లైన్లు కూడా వేస్తామని, కంగారు పడవద్దని తెలిపారు. కె.ఎల్ పురం వాసులకు రక్షిత తాగు నీటి సమస్య ఉందని గుర్తించి ఇక్కడ వాటర్ ట్యాంక్ ను నిర్మించామని, ప్రజల అవసరాల్ని తీర్చే ప్రభుత్వమని అన్నారు. విజయనగరం నియోజకవర్గం లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. అపార్మెంట్లకు, ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు తీసుకొని కుళాయిలు వేయాలని కార్పొరేటర్, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషికుమారి, తాళ్లపూడి రమణ, పబ్లిక్ హెల్త్ డి.ఈ అప్పా రావు, పార్టీ ప్రతినిధులు, కెఎల్ పురం, కామాక్షి నగర్, రెవిన్యూ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు, చిన్నారులకు పుస్తకాలు, బట్టలు పంపిణీ

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ఎస్.కోట సమీప ఏజెన్సీ పరిధిలోని మారు మూలకొండలలో చలికి బాధలు పడుతున్న పేద గిరిజనులను గుర్తించి దుప్పట్లు, చీరలు, చిన్నారులకు నోట్ బుక్స్, బట్టలు పంపిణీ చేసినట్లు యంగ్ స్టార్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు, కోచ్ రామచంద్రరావు మాస్టారు వెల్లడించారు. స్థానిక విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ ప్రతి నెలలోను అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లుగా తెలిపారు. జవహర్ నవోదయ పాఠశాలకు చెందిన భార్గవి, ప్రకాశమ్మ, రేపాక శంకర్ (రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి), యువకులు ఎస్.కె.రసూల్, వి.చందుకుమార్ తదితరుల సహకారంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని, ఇప్పటివరకు 63 మారుమూల గిరిజన ప్రాంతాల్లో దుప్పట్లు, బట్టలు, పుస్తకాలు, నిత్యావసర వస్తువులు, క్రీడా పరికరాలు వంటివి పంపిణీ చేసినట్లు రామచంద్రరావు మాస్టారు వివరించారు.

త్రైమాసిక సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గంట్యాడ: మండల కేంద్రమైన గంట్యాడలో మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన త్రైమాసిక సర్వసభ్య సమావేశము ఆదివారము జరిగినది. ఈ సమావేశంలో మండలమునకు చెందిన సర్పంచులు మరియు ఎంపీటీసీలు మండలానికి చెందిన వివిధ విభాగాల అధికారులు కూడా హాజరైనారు అధికారులు శాఖల వారీగా ప్రగతి గురించి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపించాలని చెప్పారు.ముఖ్యంగా మండలానికి చెందిన మదనాపురం బ్రిడ్జి దగ్గర సైడ్ వాల్స్ కట్టకుండా మట్టి వేయడంతో ఆ మట్టి కాలువలోకి పేరుకు పోవడంతో కాలువ నీరు పారకుండా నిలిచిపోవడం వలన రైతులు నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇరిగేషన్ జెఇ తవిటి నాయుడుదృష్టికి తీసుకువచ్చారు వెంటనే సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు పలు గ్రామాల సర్పంచులు ఆయన పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు పర్యాయాలుగా విడుదల చేయడం జరిగిందని దీనికి సంబంధించి ఆమోదం పొందిన పనులను సర్పంచులు వెంటనే మొదలు పెట్టవలసిందని సంబంధిత అధికారిని సభా పూర్వకంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్ ఎంపీడీవో భవాని తహసీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

6న ఉచిత వైద్యశిబిరం ను జయప్రదం చేయండి

అభ్యుదయ విద్యాసంస్థలు కరస్పాండెంట్ మద్రపు నాని శారద

విశాలాంధ్ర-బొబ్బిలి : ఈనెల 6 న మంగళవారం ఉ 9గం నుండి మ 1గం వరకు గౌడ వీధిలో హైస్కూల్ క్యాంపస్‌లో జరుగు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలని అభ్యుదయ విద్యాసంస్థలు కరస్పాండెంట్ మద్రపు నాని శారద విలేకరులకు తెలిపారు .జనరల్ మెడిసిన్, ఈఎన్‌టి, ఆర్థోపెటిషియన్, గైనికోలోజిస్ట్, పీడియాట్రిక్, క్యాన్సర్, జనరల్ సర్జరీకి సంబంధించిన వైద్యులు విచ్చేయుచున్నారు. 30 ఏళ్ళు దాటిన ప్రతి మహిళా తప్పక క్యాన్సర్ టెస్ట్ చేయించుకోవలెను. మారుతున్న ఆహారపుటలవాట్లు, కాలుష్యపరిణామాలు మన పూర్వీకులలో ఎవరికన్నా క్యాన్సర్ వున్నా మనకు వచ్చే అవకాశం వుంటుందని తరుచుగా పరీక్షలు చేయించు కున్నచో ఆదిలోనే తెలుసుకుంటే నివారించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అవసరం వున్నవారికి రొమ్ము, గర్భశయంకి స్క్రీనింగ్ టెస్ట్ కూడా నిర్వహిస్తాం ని. కౌన్సెలింగ్, ఆపరేషన్ మరియు మందులు ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమం ఎక్కువమందికి చేరేలా ఎక్కువమంది వినియోగించుకునేలా విజయవంతమయ్యేలా మాతో సహకరిస్తారని కోరారు.

సర్పంచ్ ప్రతినిది మధును పరామర్శించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-తెర్లాం : మండలం విజయరాంపురం (బూరి పేట)సర్పంచ్ ప్రతినిధి బూరి మధుసూదనరావు ను విజయనగరం తిరుమల హాస్పిటల్లో ఆదివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పరామర్శించారు. శనివారం మధు కి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి హాస్పిటల్ కి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సుందరాడ సర్పంచ్ దిలీప్ కుమార్, సతివాడ సర్పంచ్ జానికి రామ్, తదితరులు ఉన్నారు.

పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయం. చిన్నతనం నుండి పిల్లలకు పుస్తక పఠనంని అలవాటు చేయాలని స్థానిక గ్రంధాలయ అధికారి సి.హెచ్ కృష్ణమూర్తి తెలిపారు.స్థానిక గ్రంధాలయం లో చదవడం నాకిష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించడం అయింది. ఈ కార్యక్రమానికి హాజరు అయిన పిల్లలతో కథలు పుస్తకాలు , ఇతిహాస గ్రంథాల్లో ముఖ్యాంశాలు ను చదివించడం జరిగింది. కాలి సమయం లో పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని అన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఘనంగా శతాధిక వృద్ధురాలు చిట్టెమ్మ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, కృష్ణాపురం గ్రామంలో కీర్తిశేషులు బొజ్జ పేరయ్య భార్య, శతాధిక వృద్ధురాలు బొజ్జ నారాయణమ్మ (చిట్టెమ్మ)కు 100వ జన్మదిన వేడుకలను ఆమె కోడళ్లు, కూతుర్లు, మనుమలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. ముందుగా శతాధిక వృద్ధురాలు చిట్టెమ్మను సన్మానించారు. ఈమె పెంపకం కారణంగానే కుటుంబ సభ్యులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని మనుమలు గుర్తు చేశారు. ఈ సందర్భంగా నలుగురు కోడళ్లు, ఒక అల్లుడిని కుటుంబ సభ్యులు సన్మానించారు. చిట్టెమ్మకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు కూతుర్లు సంతానం. ప్రస్తుతం ఈమె ఐదుగురు కొడుకులు మృతి చెందారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకల కార్యక్రమంలో సర్పంచ్ యామినీదేవి దంపతులు పాల్గొన్నారు.

సంక్షేమ పరమావదికి నిదర్శనం చంద్రబాబే...

రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ



విశాలాంధ్ర-వేపాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమమే పరమావధిగా పరిపాలన చేసిన ఘనత చంద్రబాబు దేనని నియోజకవర్గ యువనేత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ అన్నారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, చామలాపల్లి,కరకవలస,జాకేరు,సోంపురం,అరిగి పాలెం, జగ్గయ్యపేట, గుడివాడ, సింగరాయి,ఆకుల సీతంపేట, ఆతవ,తదితర గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో గొంప కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలోనూ,సంక్షేమంలో ముందంజలో నిలవాలంటే తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకుడు నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళాభి వృద్ధికి అధిక్ష ప్రాధాన్యతనిచ్చారన్నారు.అలాగే నిరుపేదల అభివృద్ధి, సంక్షేమానికి,రైతు సంక్షేమానికి,బడుగు బలహీన వర్గాల వారి అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు.అవినీతి మరక అంటని నాయకుడు చంద్రబాబు నాయుడని,ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆయన అనుచరుగణం రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేస్తున్నారని తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పనకు భరోసా ఇచ్చారని చెప్పారు.యువత నిరుద్యోగులు బడుగు బలహీన వర్గాల ప్రజలు రానున్న శాసనసభ ఎన్నికల్లో చంద్రన్న సారధ్యంలో నడుస్తు,తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి అత్యధిక ఓట్లతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి,బొద్దాం,బల్లంకి,మాజీ సర్పంచులు జనపరెడ్డి ఈశ్వరరావు,బల్లంకి నాగరాజు,తెదేపా నాయకులు మంచిన అప్పలసూరి,సిరికి రమణ,మండల తెలుగు యువత అధ్యక్షుడు ముక్కా రామకృష్ణ,గుమ్మడి రవిశంకర్,శానా పతి గణేష్, కొట్టాన అర్జునరావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రమంతా రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాంగం..

టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి ఎద్దేవా

విశాలాంధ్ర-ఎల్.కోట/ఎస్.కోట: రాష్ట్రమంతా రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాంగం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి ఆరోపించారు. లక్కవరపుకోట మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం శృంగవరపుకోట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి విలేకరుల సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ రెడ్డికి తన ఆర్థిక భద్రతపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో శాంతి భద్రతలపై లేకపోవడం సిగ్గుచేటని, ఎమ్మార్వో హత్య రాష్ట్రంలోని శాంతి భద్రతలకు అద్దం పడుతుందని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నేతల అవినీతికి అడ్డు తగిలిన అధికారులపై వేధింపులు చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖ జిల్లా కొమ్మాదిలో తహశీల్దార్ రమణయ్య హత్య దుర్మార్గం, ఈ ఘటన రాష్ట్రంలోని శాంతిభద్రతలకు అద్దం పడుతుందని, మండల మెజిస్ట్రేట్ నే హత్య చేశారంటే రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రశాంతతకు నిలయమైన ఉత్తరాంధ్రలో గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదన్నారు. జగన్ రెడ్డి పాలనలో ప్రజల ఆస్తులకే కాదు, వారి ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. అసలు హోంమంత్రి ఎవరో వైసీపీ ఎమ్మెల్యేల్లో సగం మందికి తెలియదని ఎద్దేవా చేశారు. తహశీల్దార్ రమణయ్య హత్యపై వెంటనే విచారణ చేపట్టి దోషుల్ని కఠినంగా శిక్షంచాలని డిమాండ్ చేశారు. ఇక గుడివాడలో భూకబ్జాను అడ్డుకున్న వీఆర్వోను జేసీబీతో తొక్కి చంపేందుకు కొడాలి నాని అనుచరులు యత్నించారన్నారు. ఎప్పుడు .. ఎక్కడ... ఎవరిపై దాడులు జరుగుతాయో, ఎప్పుడు ఎవరు హత్యకు గురవుతారోనని ప్రజలు వణికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, మాజీ ఎంపీటీసీ మళ్ళ రామకృష్ణ, సోంపురం గొర్రిపోటు రాము, ఎల్.కోట మండల టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మునిరి కొండలరావు, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మోహన్, అక్కిరెడ్డి వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జానుమల్లువలసలో ఘనంగా బాబు భవిష్యత్ గ్యారంటీ ...

హాజరైన బొబ్బిలి, పార్వతీపురం టీడీపీ ఇంచార్జిలు

బేబీనాయన, విజయచంద్ర, జనసేన సమన్వయ కర్త మోహనరావు

విశాలాంధ్ర-సీతానగరం: రానున్న ఎన్నికల్లో టీడీపీఅధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు అంతా కష్టపడి పనిచేయాలని బొబ్బిలి,పార్వతీపురం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జిలు బేబీనాయన ,బోనెల విజయ్ చంద్రలు పిలుపునిచ్చారు.ఆదివారం సాయంత్రం మండలంలోని జానుమల్లువలస గ్రామంలో యాల్ల రామినాయుడు, కంద్యాన రవీంద్రనాయుడు, బలగ ధనుంజయనాయుడుఆధ్వర్యంలో భాబుష్యూరిటీ -భవిషత్ కు గ్యారంటీ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. వారిద్దరికీ మేళ తాళాలతో, మందుగుండు సామాగ్రితో,కొల్లతంతో మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు.స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.అన్ని వీదుల గుండా ఊరేగింపు నిర్వహించి ఇంటింటికి వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు మినీ మ్యానిఫెస్టును ఇంచార్జి విజయ్ చంద్ర వివరించారు.అనంతరం రామమందిరం వద్ద జరిగిన బహిరంగ సభలో ఇంచార్జిలు బేబీనాయన,విజయ్ చంద్రలు టీడీపీ కార్యక్రమాలు గూర్చి వివరించారు.జన సేన సమన్వయ కర్త ఆదారు మోహన రావు మాట్లాడుతూ టీడీపీ జనసేన సమన్వయంతోఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీను ఓడించాలని పిలుపు నిచ్చారు.వారి ముగ్గురిని ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో టీడీపి నాయకులు సాల హరిగోపాల్, కొల్లి తిరుపతిరావు,గొట్టాపు వెంకటనాయుడు,పోలనత్యనారాయణ, దామినేని భానుప్రసాద్,రెడ్డి/దాసరి సింహాచలంనాయుడు,బొమ్మినాయిని లక్ష్మణ, బుడితి శ్రీను, నబ్బాన శ్రీను, గరికయ్య, గొట్టాపు అప్పారావు, తేరేజమ్మ, గరికయ్య ,పైల నాగభూషణరావు,వాకాడ పారినాయుడు, పోల తిరుపతిరావు, తెంటు రామారావు, బలగ శ్రీనివాసరావు, తేరేజమ్మ, భోగి శంకరరావు,యాండ్రాపు ప్రసాదరావు, తిరుపతిరావు, యాల్ల సత్యంనాయుడు, యాల్ల రామారావు, యాల్ల నాగభూషణ,రమేష్, కొల్లి సురేష్,ఉడమల సూర్యనారాయణ, భాస్కరరావు, రామకృష్ణనాయుడు ,జక్కుపకీరునాయుడు, మద్రాపు సత్యనారాయణ, తాన్న సత్యనారాయణ, యోగేశ్వరరావు, బర్ల వెంకటరమణ,ధనంజయ,వాసు, తేలు తిరుపతి,జగన్నాధం, ఎన్ సతీష్, వంజరాపు గుంపస్వామి, బి. శ్రీరాములు, తేలు శేఖర్,సాయి,జనసేన మండల అధ్యక్షులు వి శ్రీనివాసరావు, రాజు,ధనంజయ,తదితర టీడీపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.ముందుగా పార్టీ పతాకాన్ని ఎగురవేశారు.

ఉపాధ్యాయ విద్యకు 'విద్యా సామాజిక ఆధారాలు' పుస్తకం ఎంతో ఉపయోగం

రచయిత డా॥ శంకరరావును అభినందించిన అతిథులు



విశాలాంధ్ర -సీతానగరం:ప్రస్తుతం విద్యా విభాగం ఎలాఉంది,ఉపాధ్యాయవిద్యకు కావాల్సిన ముడిసరుకు ఏంటి,జాతీయ సమగ్రతలక్ష్యం, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక అభివృద్ధి తెలుసుకోవడంఎలా,ఎన్ఈపీ-2020 లక్ష్యం ఏమిటి తదితర అంశాలను తెలుసుకోవడానికి 'సోషిలాజికల్ ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లోని విద్యా సామాజిక ఆధారాల"పుస్తకం ద్వారా తెలుసు కోవచ్చు ని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మండలంలోని గుచ్చిమి గ్రామపంచాయతీలోని తాన్న సీతారాంపురం గ్రామానికి చెందిన డాక్టరు కొచ్చెర్ల శంకరరావు ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి లగుడు సింహాద్రి బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. అతడు బి.ఈడి విద్యార్థుల కోసం రచించిన పుస్తకాన్ని అతిథులు అరకులో ఆవిష్కరించారు. అక్కడ జరిగిన ఏపీ, తెలంగాణా యంగ్ థింకర్స్ మీట్‌కు బీజేపీ ప్రధాన కార్యదర్శి, ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ్ మాధవ్, కర్నూలు ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరావుకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఎంజీఎన్‌సీఆర్ఈ, ఏపీమాజీ ప్రోగ్రాం కన్వీనర్ ఎం. సాయికిరణ్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈపుస్తకం ఉపయోగాల్ని అతిథులంతా వివరించి రచయిత డాక్టర్ కె. శంకరరావును అభినందించారు.

పాఠశాలల్లో ప్రకృతి వ్యవసాయ సిలబస్ అవసరం

ఏపీటీఎఫ్ నాయకులు బాలకృష్ణారావు

విశాలాంధ్ర-పార్వతీపురం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలల నుండి కళాశాలల స్థాయి వరకు ప్రకృతి వ్యవసాయాన్ని సిలబస్ గా చేర్చడానికి ఎన్సీఈఆర్టీ ద్వారా రాష్ట్ర కన్సల్టెంట్ గా నియమింపబడిన డాక్టర్ పారినాయుడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి పూర్వ ప్రాథమిక విద్య నుండి ఉన్నత పాఠశాల విద్య వరకు ప్రకృతి వ్యవసాయ అంశాలను బోధించడానికి తగు చర్యలు తీసుకున్నందుకు ప్రకృతి వ్యవసాయ వాచకాల రచయితల తరపున రౌతు వాసుదేవరావు, బెలగాం భీమేశ్వరరావు డాక్టర్ పారినాయుడుల కృషిని ఏపీటీఎఫ్ నాయకులు నల్లా బాలకృష్ణరావుఅభినందించారు. నేటి విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు ప్రకృతి వ్యవసాయం మీద కూడా అవగాహన కల్పించవలసిన అవసరం కూడా ఎంతో ఉందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. దీనికోసం జట్టు ట్రస్ట్ అధినేత డాక్టర్ పారినాయుడు గారి నేతృత్వంలో ఇప్పటికే పూర్వ ప్రాథమిక మరియు ఒకటవ తరగతికి సంబంధించిన వాచకాలను సరళమైన భాషలో తెలుగుబిఆంగ్లం పాఠ్యపుస్తకాలను రూపొందించినట్లు వీరు తెలియజేశారు. నేటి ఆధునిక కాలంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కోసం అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అటువంటి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగు గూర్చి ప్రాదమిక పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరమని, దీనికోసం జట్టు ట్రస్టు చేస్తున్న కృషిని కొనియాడారు.

టిడిపి మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మొద్దు

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

విశాలాంధ్ర-పాచిపెంట: టిడిపి జనసేన పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను తప్పుతో పట్టిస్తుందని మాయగాళ్ళ మాయ మాటలకు మోసపోవద్దని డిప్యూటీ సీఎం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. ఆదివారం మండలంలోని జాతీయ రహదారి 26 నుంచి సాలూరు మండలం కరడావలస వరకు 4.96కోట్లతో అలాగే ఆజూరు నుంచి చాకిరేవువలస మీదుగా పందిరి మామిడి వలస వరకు 2.24 కోట్లతో నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్లను ప్రారంభించారు. ఆజూరు జంక్షన్ నుంచి కంకణాపల్లి వరకు 1.70 కోట్ల తో బీటీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆజూరులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే గిరిశిఖర గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు విరాజిల్లుతున్నాయన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గిరిజన ప్రాంతాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదని గిరిజనులు నిలువునా మోసం చేశారన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ మరలా మాయ మాటలు చెప్పుకుంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని, వారి మాయ మాటలకు ఎవరు మోసపోవద్దని హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ నాయకులు గజదొంగలు అన్నారు. సాలూరు నియోజకవర్గానికి సంబంధించి మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆర్పి బంజిదేవ్, ఆరు సంవత్సరాలు ఎమ్మెల్సీగా పనిచేసిన సంధ్యారాణి కనీసం ఒక్కటంటే ఒక్క గిరిజన గ్రామానికి కూడా ఒక్క రహదారి కూడా వేసిన దాఖలాలు లేవన్నారు. కేవలం గిరిజన ఓట్లు తప్ప గిరిజన ప్రాంతాల అభివృద్ధి వారికి పట్టదన్నారు. కరడావలసలో త్వరలో రేషన్ డిపో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నా నన్నారు. మంచి చేస్తున్న ముఖ్య మంత్రికి ప్రజలంతా తోడుగా నిలిచి రానున్న ఎన్నికల్లో వైయ స్సార్సీపీకి అత్యధిక మెజార్టీని కట్టబెట్టా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బద్నాన ప్రమీల, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, మీసాల నారాయణ, కొరిపల్లి రవీంద్రనాథ్, సాలూరు పాచిపెంట మండలాల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, సువ్వాడ భరత్ శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు దోల బాబ్జి, పాచిపెంట వీరంనాయుడు దండి శ్రీనివాసరావు పలువురు సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీ చేయాలి

- జంపర కోట ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి

- 8న జరిగే ధర్నాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పాలకొండ: రైతు, కౌలురైతులకు రూ. 2లక్షల వరకు అన్ని రకాల పంటరుణాలు మాఫీ చేయాలని, కరువు, తుఫానుల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం మరియు పంటల భీమా పథకం వెంటనే చెల్లించాలని, రైతులు, కౌలు రైతులు సాగుచేస్తున్న ప్రతి ఎకరానికి రూ.15వేలు సాగు సాయం అందించాలని కోరుతూ ఫిబ్రవరి 8న అన్ని జిల్లాల కలక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాలు గడుస్తున్నా గిరిజన రైతన్న ఉపయోగపడే జంపర్ కోట ప్రాజెక్ట్ రిజర్వాయర్ పనులకు పాలక, ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో నేటికీ ప్రాజెక్టు పనులు పూర్తికాక సాగుకు ఉపయోగపడవలసిన నీరు వృధాగా పోతుందని దీనిపై పాలక, ప్రతిపక్షాలు కదిలించే విధంగా పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఈనెల 8వ తేదీన పాలకొండ ఆర్డిఓ కార్యాలయం వద్ద జరుగు ఆందోళనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే స్థానిక అభ్యర్థులు జంపర్ కోట ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తికి మరియు తోటపల్లి కాలువల ఆధునీకరణ పనుల పూర్తికై స్పష్టం చేయాలని కోరుతూ వారిపై ఒత్తిడికి రైతాంగం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి, సిమ్మి నాయుడు, ముంజు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

యువ సాహితీవేత్త గౌరి నాయుడు కి ప్రతిభా పురస్కార అవార్డు ప్రదానం

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్న పేట గ్రామానికి చెందిన యువ రచయిత , సాహితీ వేత్త డాక్టర్ కిలారి గౌరి నాయుడు కి ప్రతిభా పురస్కారం లభించిందని ఆయన తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ శనివారం విశాఖలోని అంకిత వెంకట నరసింహారావు ఆడిటోరియంలో సంస్థ వార్షికోత్సవ సందర్భం పరిష్కరించుకొని అవార్డు ప్రదానం చేశారని తెలిపారు. సాహితీ సంస్థ గౌరవ అధ్యక్షులు ఎమ్మెస్ నాయుడు, ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారి, కన్వీనర్ పి వెంకటరత్నం, కోశాధికారి గాయత్రి తదితరులు గౌరు నాయుడుని ఘనంగా సత్కరించారని తెలిపారు. సాహిత్య , సాంస్కృతిక సంగీత కళారంగాలలో గౌరీ నాయుడు చేస్తున్న కృషి కి ఈ బహుమతి ప్రధానం చేశారని ఆయన తెలిపారు ఈ సందర్భంగా బంధువులు మిత్రులు అభిమానులు గ్రామస్తులు తదితరులు ఆయన్ని అభినందించారు అని ఆయన తెలిపారు.

సీతానగరం మండలంపై దృష్టి సారించిన బేబీనాయన...

విశాలాంధ్ర-సీతానగరం: పార్వతీపురం-బొబ్బిలి నియోజక వర్గంలోని మధ్యలో ఉన్న సీతానగరం మండలం అంటే బొబ్బిలి రాజులకు యెనలేని అభిమానం,ఆప్యాయత, అనురాగాలు చిరకాలం నుండి ఉన్నాయి. సీతానగరం మండలంలోని బొబ్బిలి రాజుల వ్యవసాయభూములు, ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, అప్పయపేటలోని విడిది కేంద్రం ఇలా అన్ని రకాల మౌళిక సదుపాయాలు ఇక్కడ ఉండటంతో ఇక్కడ ప్రజలంటే వారికి ఎంతో మక్కువ. ఇదేసమయంలో రాజకీయాలకు అతీతంగా అన్నిగ్రామాల్లో కూడా రాజులంటే యెనలేని అభిమానం కలిగిన ప్రజలు ఇక్కడ ఉండటం కూడా గమనార్హం. ఇప్పుడు బొబ్బిలి రాజులుగా ఉన్నమాజీ మంత్రి సుజయ్ నాయన, మాజీ మున్సిపల్ చైర్మన్ బేబీనాయనలను సీతానగరం మండలంలోని ప్రజలంతా ఎంతో ఇష్ట పడతారు. ముఖ్యంగా బేబీనాయనను ఎంతో అభిమానంగా చూస్తారు. ఆయన వారంలో ఒకటి రెండు రోజులు సీతానగరం మండలంలోని తన వ్యవసాయపొలంకు వచ్చి వారితో కలిసి సరదాగా కబుర్లు చెప్పి అందరితో మమేకం కావడంతో ఇక్కడ ప్రజలనుండి అభిమానం, ఆదరణ పొందారని చెప్పడంలో అతిశయోక్తి కాదేమో అనిపిస్తుంది.సీతానగరం మండలంలోని ప్రతీరోజూ 100మంది నుండి 200మందికి ఆయనే నేరుగా ఫోన్ చేసి మాట్లాడతారు. అందరినీ పేరు పెట్టి ఆప్యాయంగా పలకరించి మాట్లాడటం బేబీనాయనకు ఉండే గొప్ప లక్షణంగా ఈప్రాంత ప్రజలు,నాయకులు చెప్పుకుంటారు. రాజరిక కుటుంబానికి చెందిన ఆయన అందరితో కలిసి సరదాగా కాసేపు కబుర్లు చెప్పి అందరినీ నవ్విస్తూనే ఆయన పెద్దగా నవ్వడం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. దీంతో పాటు ఎన్నో ఏళ్లగా ఆయన చేస్తున్న సేవాకార్యక్రమాలు, దాతృత్వ కార్యక్రమాలు, ఆదుకున్న కార్యక్రమాలు, అన్నదానకార్యక్రమాలు ఇలా అన్ని రకాల సేవా కార్యక్రమాల గూర్చి నియోజక వర్గంలోని అందరికీ తెలిసిందే. అటువంటి బేబీనాయన ఏప్రిల్ 2024లో జరగనున్న ఎమ్మెల్యే ఎన్నికలో టీడీపీ తరుపున బొబ్బిలి ఎమ్మెల్యేగా పోటీచేయనున్నారు. ఇప్పటికే టీడీపీ ఇంచార్జిగా బొబ్బిలి నియోజక వర్గంలోని ప్రతీగ్రామాన్ని, వార్డును , వాడ వాడను సందర్శించిన సంగతి తెలిసిందే. అంత బిజీగా ఉండే బేబీనాయన ఇటీవల కాలంలో సీతానగరం మండలంలోని శుభ కార్యక్రమాల్లో,పరామర్శ కార్యక్రమాల్లో, టీడీపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. రెండు నియోజకర్గాలలో తనకున్న పలుకుబడిని, పట్టును, అభిమానాన్ని తగ్గకుండా ఉండేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలుస్తుంది. బొబ్బిలితో పాటు తనకు ఇష్టమైన పార్వతీపురం నియోజక వర్గంలో టీడీపీ విజయమే తనముందున్న లక్ష్యమని తన అనుచరులతో చెబుతున్నట్లు సమాచారం. రెండు నియోజక వర్గాలలో కూడా అత్యధిక మెజారిటీతో టీడీపీను గెలిపించి అధినేత చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలన్న ధ్యేయంతో బొబ్బిలి యువరాజు బేబీనాయన గత కొన్ని రోజులుగా తన ప్రణాళికను అమలు చేస్తున్నారని ఆయన అనుచరులు చెప్పడం గమనార్హం.

పలువురు వైసీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని పనుకుపేట గ్రామంకు చెందిన వైసీపీ కుటుంబీకులయిన అరసాడ శామ్యూల్ ఇటీవలకాలంగా అనారోగ్య కారణంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు వారినివాసానికి వెళ్లి పరామర్శించారు. గుచ్చిమి గ్రామంలో వైసీపీ కార్యకర్త, మాజీ పిఎసిఎస్ చైర్మన్ అంబటి సింహాచలం ఇటీవల అనారోగ్య కారణంతో అకాలమరణం చెందిన సంగతి తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం సాయంత్రం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈపరామర్శలో ఎమ్మెల్యేతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరందుకున్న బాబు భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం: మండలంలో టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్‌చంద్ర అదేశాలు, సూచనలు, సలహాలు మేరకు బాబు భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం అన్ని గ్రామాల్లో లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నట్లు మండల టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోనుదేవీచంద్రమౌళి, గొరజాన చంద్రమౌలిలు తెలిపారు. ప్రతీ రోజూ తమతో పాటు క్లస్టర్ ఇంచార్జిలు, స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీమ్యానిఫెస్ట్ గూర్చి వివరించడం జరుగుతుందన్నారు.ఆదివారం తాళ్ళబురిడి గ్రామంలో జరిగిన బాబు భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

ఎస్.కోట శాఖా గ్రంథాలయంలో 'చదవడం-మాకిష్టం' కార్యక్రమం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ చిన్నారులతో నిర్వహించారు. విద్యార్థులచే నీతి కథలు చదివించడం.. కథలో నీతిని లైబ్రేరియన్ శ్రీధర్ వివరించారు. అనంతరం విద్యార్థులు క్యారం బోర్డ్, చదరంగం తదితర ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులను ఉద్దేశించి లైబ్రేరియన్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని, గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాలను చిన్ననాటి నుంచి వినియోగించుకోవాలని సూచించారు.

ఎర్ర బాబురావు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: బాడంగి మండలం లక్ష్మీపురం గ్రామం ఆంధ్రప్రదేశ్ కల్లుగీత వృత్తిదారులు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర బాబురావు(68)ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఇతను తదితర గ్రామాల కళ్ళు గీత సహకార సంఘాలకు సుమారు 3 సంవత్సరాలు పాటు సేవలు అందించి కళ్ళు గీత వృత్తి దారులకు గుర్తింపు కార్డులు,వృత్తి పరికరాలు, ప్రభుత్వం ద్వారా అందించడమే కాకుండా 2012 వ సంవత్సరంలో హుదూద్ తుఫాన్ వచ్చిన సంవత్సరంలో కల్లుగీత సొసైటీలకు కిస్తీలు రద్దు చేయాలని ఆనాటి ప్రభుత్వం తో పోరాడి సాధించిన ఘనత బాబురావుదే అని విజయనగరం జిల్లా కళ్ళు గీత సంఘం అధ్యక్షులు కొల్లి అప్పారావు అన్నారు. 2-2-2024 న కొల్లి అప్పారావు తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు బాబురావు కుటుంబాన్ని పరామర్శించారు. బాబురావు సేవలు మరువలేనివి అన్నారు.ఇప్పుడు ఆ కుటుంబం దిక్కులేనిది అయింది అని కనుక ప్రభుత్వం తక్షణమే స్పందించి తక్షణ సహాయం గా భార్య అయిన ఎర్రమ్మకు పింఛను అందించి ఆదుకోవాలని కొల్లి. అప్పారావు , పురం. అప్పారావు కోరుతున్నారని విలేకర్ల తో తెలిపారు.

అది పెద్దోళ్ళ ఆక్రమణ.. వదిలేయాల్సిందే..!

ధర్జాగా భూకబ్జా చేసి లేఅవుట్‌లు వేసిన ఘనులు

సర్పంచ్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని యంత్రాంగం

అధికార పార్టీ పెద్దల అండే కారణమంటూ పుకార్లు



విశాలాంధ్ర-జామి: అంగబలం, అర్ధబలం ఉంటే చాలు.. ప్రభుత్వం భూములు ఆక్రమించి లేఅవుట్‌లు వేసి అమ్మేయ వచ్చు.ఇక అధికార పార్టీ బలం తోడయితే ఇక అడిగేవారు ఎవరు..? అందుకు ఉదాహరణగా మండలంలోని అట్టాడ రెవెన్యూలో జరుగుతున్న ఓసొసైటీ భూఆక్రమణను చెప్పుకోవచ్చు. అట్టాడ రెవెన్యూ భీమునిపట్నం సొసైటీ పేరుతో దాదాపు ఆరేళ్ళ క్రితం భూములను స్థానికులనుంచి కొనుగోలు చేసి లేఅవుట్ వేసారు. భూసేకరణ సమయంలో జిరాయితీ భూములతోపాటు ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయని గుర్తించిన రియల్ వ్యాపారులు వాటికి ఎంతోకొంత ముట్టజెప్పి రైతుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసే సమయంలో ప్రభుత్వ భూమిని మినహాయించాలి. కానీ సొసైటీ దారులు తమ పలుకుబడిని వినియోగించి నాటి పంచాయితీ పాలకులను, అడిగేవారి నోర్లు మూయించారు. దాదాపు 30 ఎకరాల వరకు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు ప్రభుత్వం భూమితో కలిపి లేఅవుట్ వేసి స్థలాలను అమ్మకాలు చేపట్టారు. ఇదే సమయంలో పంచాయతీకి ఇవ్వాల్సిన 10శాతం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసారు. కానీ ఈస్థలాన్ని పంచాయతీకి ఇవ్వలేదు. ఇప్పుడు ఆస్థలం కూడా ఎక్కడ ఉందో ఎవరికీ అర్ధంకాదు. లేఅవుట్ చుట్టూ ప్రహరీ వేయడంతో లోపల ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇదిలా వుండగా లేఅవుట్ వేసే సమయంలో స్థానిక పంచాయతీ పెద్దలకు లేఅవుట్ దారులు ప్రభుత్వ భూమిగా ఉన్న ఎకరాలకు పైగా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని, ప్రజోపయోగ పథకాలకు వినియోగించుకోవచ్చనే అగ్రిమెంట్ రాసి ఇవ్వడం విశేషం. ఈనేపథ్యంలో ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్న పోతల అమ్మన్న దొర ప్రభుత్వభూమితోపాటు, పంచాయతీకి ఇచ్చిన స్థలంపై పోరాటం చేసారు. అధికారుల చుట్టూ తిరిగారు. కానీ వారి పలుకుబడి ముందు సర్పంచ్ ఏమీ చేయలేక పోయాడు. చివరకు జిల్లా గ్రీవెన్‌కి ఇచ్చినా ఫలితం లేకపోయింది. ఇదిలా వుండగా గతంలో తహశీల్దార్‌గా పనిచేసిన హేమంత్‌కుమార్ లేఅవుట్ భూములపై సర్వే చేయించారు. దీంతో ఎకరన్నర భూమి ప్రభుత్వ భూమి ఉందని నిర్ధారణ చేసారు. మరికొంత భూమిని సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. కానీ ఇంతలో బదిలీలు కావడంతో కథ కంచికి చేరింది. దీనిపై రెవెన్యూ వర్గాలకు అన్ని విషయాలు తెలిసినా మౌనం వహిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు సైతం కోరుతున్నారు.

పది పరీక్షలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలి

విజయవంతమైన ప్రజ్ఞా వికాస పరీక్ష

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) శృంగవరపుకోట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్.కోట నియోజకవర్గ కేంద్రంలో వున్న చైతన్య డిగ్రీ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షను ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ రావు, యూటీఎఫ్ జిల్లా నాయకులు జి.వెంకటరావులు పరీక్షా పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న సమస్యలపై అదే విదంగా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనకై పోరాటాలే కాదు, విద్యార్థులను బాగా చదువుకునేందుకు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రోత్సహించేందుకు నిరంతరం ఎస్.ఎఫ్.ఐ పాటు పాడుతుందని, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ అలవర్చుకుని ఈ సమాజాన్ని మార్చేందుకు, ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోతున్న 10వ తరగతి పరీక్షల్లో ఈ ప్రజ్ఞ వికాస పరీక్షను ఉపయోగించుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు వెంకటరావు మాట్లాడుతూ పరీక్షలు దగ్గర అవుతున్న క్రమంలో ఎస్.ఎఫ్.ఐ నిర్వహించే ఈ పరీక్ష విద్యార్థులకు ఉపయోగ పడుతుందని, విద్యార్థులు దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పరీక్షకు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రమేష్, జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ ఎం. కళ్యాణి, మండల అధ్యక్షులు వి.జయ, మండల గర్ల్స్ కన్వీనర్ భారతి, మండల నాయకులు చరణ్, చైతన్య, రమాదేవి, హర్ష, అనిల్, అను, ఆర్.రవి, రిషి, రాము, నాయుడు పాల్గొన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న క్లబ్ నడక మైదానంలో ఆదివారం ఉదయం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్యాన్సర్ పై అవగాహనతో పాటు.. వాసవి డయాగ్నొస్టిక్ సెంటర్ వారి సౌజన్యంతో మధుమేహ పరీక్షలను క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా క్లబ్ గౌరవ సలహాదారులు పిన్నింటి సూర్యనారాయణ, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాష్టారు హాజరయ్యి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు క్రమంతప్పకుండా క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండాలని, క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం అవసరమని, షుగర్ ను అదుపులో ఉంచుకోవాలని, మహమ్మారి క్యాన్సర్ బారినపడకుండా ఉండాలంటే.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, దానితో పాటు ఆహార నియమాలు పాటించాలని సూచించారు.సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో చేయబోయే కార్యాచరణను రూపొం దించామని, క్లబ్ ద్వారా మరెన్ని సేవా కార్య క్రమాలతో ముందుకెళ్తా మని అన్నారు. కార్యక్రమం లో క్లబ్ గౌరవ సలహా దారులు ఎ.తిరుపతి రావు, ఉపాధ్యక్షులు వల్లూరి శ్రీనివాసరావు, జనార్ధన్ మాష్టారు, క్లబ్ కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు,క్లబ్ జాలీ వాకర్ కిలారి గోవింద్, సభ్యులు పైడియ్య, కోట్ల ఈశ్వరరావు, పి.అప్పలరాజు తదితరులు పాల్గున్నారు.

కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఎన్నోఏళ్లగా అస్తవ్యస్తంగా, ఆటంకాల నడుమ మగ్గిన అంబటి సత్రం కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ ప్రధాన రహదారికి మోక్షం లభించినట్లు అయింది. ఆదివారం రహదారి నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఆర్ అండ్ బి నిధులు 3.50 కోట్లు, కార్పొరేషన్ నిధులు 93.50 లక్షలతో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. పండుగ వాతావరణంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబటి సత్రం నుండి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో నీళ్ళ ట్యాంక్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న అంబటి సత్రం నీళ్ళ ట్యాంకు జంక్షన్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ రహదారి పనులు పూర్తయితే నగరంలో ప్రధాన రహదారుల సమస్య తీరినట్లు అవుతుందని అన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి చేయగలిగామన్నారు. శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత నగరంలో సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరించామన్నారు. తాగునీటికి అనేక అవస్థలు ఎదుర్కొనే వారని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో ప్రస్తుతం రోజు విడిచి రోజు మంచినీటిని అందించగలుగుతున్నామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రధాన జంక్షన్ లను అభివృద్ధి చేసామన్నారు.12 వందల వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయించామన్నారు.చెరువులు పార్కులను తీర్చిదిద్దామన్నారు. రాష్ట్రంలో ఏకైక మహిళా పార్కును కూడా ఏర్పాటు చేసామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తుంటే తాము అభివృద్ధి పరంగా నగరాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ఎక్కడా అవినీతి, లంచగొండితనం లేకుండా పూర్తి పారదర్శకంగా పాలన సాగుతుందని అన్నారు. త్వరలోనే కంటోన్మెంట్ అయ్యన్నపేట రహదారిని కూడా ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం ఇవ్వనున్నట్లు తెలిపారు.మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, తనను శాసనసభ్యునిగా గెలిపించినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు, ఇసరపు రేవతి దేవి, బండారు ఆనందరావు,పట్టా ఆదిలక్ష్మి, రాగాన రూపాదేవి, కో ఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణీ, వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రెవిన్యూవ్యవస్థలోని లోపాలను యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేయాలి

విశాలాంధ్ర-బొబ్బిలి : బొండపల్లి తాసిల్దార్ రమణయ్య హత్య తర్వాతఅయినా 2023 జనవరిలో ఎన్ జి టి ఇచ్చిన ఆదేశాలు ప్రకారం కలెక్టర్, జిల్లా ఎస్పీతో కూడిన టాస్క్ ఫోర్స్ కమిటీ రాష్ట్రంలోని ప్రతిజిల్లాలోని ఏర్పాటుచేసి భూ ఆక్రమణలు మరియు అక్రమాలపైన యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టకపోతే రాష్ట్రంలోని మరిన్ని హత్యలకు ప్రభుత్వమే సహకరించినట్లు అవుతుందని భారతీయ చెరువుల పరిరక్షణసమితి ఆందోళన వ్యక్తం చేశారు. వందేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేలోకూడా భూ ఆక్రమణలను గుర్తించడంలో వైఫల్యం చెందడం అక్రమాలకు అవకాశం కల్పించేదిగా ఉండడం ప్రజలను మరింత గందరగోళానికి గురిచేసిందని భారతీయ చెరువుల పరిరక్షణ సమితి అభిప్రాయం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో లక్షల్లో భూ ఆక్రమణలు మరియు అక్రమాలు జరిగి ఉన్నాయని వాటిని నియంత్రించడంలో జరిగిన వైఫల్యాలు కారణంగా రెవిన్యూ వ్యవస్థ అక్రమాలకు అడ్డంగా మారిపోవడం రాష్ట్రంలోని శాంతిభద్రతలు ప్రమాదంలో పడ్డాయికావున ప్రతి జిల్లాలోని టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటుచేసి ప్రామాణిక రికార్డులు ఆధారంగా భవిష్యత్తులో తప్పులుకి అవకాశం లేకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేపట్టి రాష్ట్రంలోని ప్రజలను కాపాడాలని అన్నారు.

జమ్ము పాఠశాల సందర్శించిన పాఠశాల విద్యా కమిషనర్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : గత ఏడాది జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ విద్యాలయ పురస్కారానికి ఎంపికైన జమ్ము ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ ఆదివారం సందర్శించారు. జాతీయ స్థాయిలో 2021-22 లో 35 పాఠశాలలను స్వచ్ విద్యాలయలుగా మన రాష్ట్రం నుంచి జమ్ము ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేశారు. జిల్లా పర్యటన కోసం వచ్చిన కమిషనర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మౌళిక వసతులు, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో ఇక్కడ ప్రధానోపాధ్యాయులు గా పనిచేసి స్వచ్ విద్యాలయం గా రూపొందించడంలో కృషి చేసిన ఎం. రామ్మోహన్ రావును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, ఎం.ఈ.ఒ.లు రాజు, సత్యవతి, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో క్యాన్సర్ ఆసుపత్రి మంజూరు చేయాలి

దీక్ష చేపట్టిన లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా కేంద్రంలో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం మయూరి కూడలిలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ దీక్ష చేపట్టారు. దీనికి జనసేన నేత గురాన అయ్యలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతక రోగమని, దీని బారిన పడినవారు ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుని వైద్యం చేయించుకున్నా, చివరకు ప్రాణాలు నిలుపుకోలేక పోతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రోగులు విశాఖ వెళ్లి వైద్యం చేయిం చుకోలేక అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. విజయనగరంలో ప్రభుత్వమే క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభిస్తే, ఈ ప్రాంత ప్రజలతో పాటు శ్రీకాకుళం, ఒడిశా వాసులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ప్రతి విద్యార్థి పుస్తక పఠనం పై ఆశక్తి చూపాలి

ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి ఆంధ్రప్రదేశ్ సాంఘీక శాస్త్ర బాలుర వసతిగృహ ఆవరణలో ఆశయ సంస్థ, ఆశయ.రూరల్ లైబ్రరీ, మొబైల్ లైబ్రరీ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పుస్తక పఠనంపై అవగాహన, పుస్తకాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలు చదవడం వల్ల పుస్తకాలతో స్నేహం కుదురుతుంది చదువంటే భయం ఆందోళన తొలగిపోతాయి నిత్యం పుస్తకాలు చదవడంవల్ల వాటి ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. పుస్తక. పఠనం. అలవాట వుతుంది భాష, మెరుగుపర్చుకొనేందుకు మంచి మార్గం, జ్ఞానం పెంపొందిం చుకోవడంతో పాటు విద్యార్థులు వ్యక్తిగతంగా తీర్చుకొనేందుకు ఎంతో దోహదపడుతుంది అని రోజు. వారిలో కనీసం రెండు గంటలు పుస్తకాలు చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎస్సీ 2024లో అప్రంటిస్ విధానాన్ని రద్దుచేయాలి

జిల్లా పిఆర్టీయు అధ్యక్షులు వాలేటి తవిటినాయుడు



విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రభుత్వం కొత్తగా ప్రకటన చేసిన డి.ఎస్సీ 2024 అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేయాలని, టీచర్లలో మరింత కాక రేపుతున్న అప్రెంటీస్ విధానం రద్దుచేయాలని జిల్లా పి ఆర్ టి యు అధ్యక్షులు వాలేటి తవిటి నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1994 నుండి 2008 వరకు టీచర్లను 2 ఏళ్ళ అప్రెంటిస్ పై నియామకాలు జరిగేవని, 2012నుండి టీచర్ల నియామకాల్లో అప్రెంటిస్ ఎత్తివేసి నియామకాలు జరుగుచున్న సమయంలో మరలా ఇటువంటి విధానం పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఒకే పని, ఒకే పోస్టు, ఒకేపని గంటలకు ఇచ్చే వేతనాలలో తేడా చూపటం అన్యాయమన్నారు. అప్రెంటీస్ పేరుతో శ్రమ దోపిడీ చేయడమేనని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, డిఎస్సీ ప్రకటనలోగా అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుచేయాలి

విశాలాంధ్ర-చీపురుపల్లి : పిఆర్‌టియు జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం జెడ్‌పి హైస్కూల్ బాయ్స్, చీపురుపల్లి లో జరిగింది. ఈ సమావేశం జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి రవీంద్ర నాయుడు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా శాఖ నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ సమర్పించడం జరిగింది. సంఘం చేపట్టిన వివిధ కార్యక్రమాలు నివేదికలో సమర్పించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ మన యూనియన్ ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం నిత్యం పరితపిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా ఈ ప్రభుత్వం సాధారణ ప్రజలకు అనేక రకాలుగా సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ ప్రజలమన్ననలు పొందినట్లుగా ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలు కూడా అందజేసి మా ఉపాధ్యాయుల మన్ననలు పొందాలని కోరుతున్నాను. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ లో పోస్టులు పెంచాలని.అదేవిదంగా అప్రెంటిస్ షిప్ లేని డీఎస్సీ వేయాలని కోరడం జరిగింది. మంచి పిఆర్‌సి ప్రకటించాలని, ప్రస్తుతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చెయ్యాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు , ఇప్పిలి అనంతం, పతివాడ రాజారావు. హెచ్‌డబ్ల్యుఓ మంగళగిరి శ్రీనివాస్ రావు. పిఆర్‌టియు నాయకులు పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు బైరీ అప్పారావు, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ రావాడ రాంబాబు అల్లి. రాంబాబు, వాలేటి. తవిటినాయుడు, కాగాన విజయ్, మురళీకృష్ణ, కేశవరావు, బంకపల్లి శివప్రసాద్, రౌతు రాము, శశికుమార్, పైడిరాజు రామకృష్ణ శంకర్‌నాయుడు, సత్యం మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు డా॥ ఏకే ఏ నాయుడు కుమార్తె జయశ్రీ వితరణ

విశాలాంధ్ర-బొబ్బిలి: టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నక్యాంటీన్ అన్నదాన కార్యక్రమమునకు సీతానగరం కు చెందిన డాక్టర్ ఏకే నాయుడు కుమార్తె అంబటి జయశ్రీ జన్మదిన వేడుకలు సందర్భంగా ఆదివారం 589వ రోజున అన్నక్యాంటీన్ అన్నదాన కార్యక్రమమునకు అయిన మొత్తం ఖర్చును వారే ఏర్పాటు చేశారు .డాక్టర్ అంబటి జయశ్రీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రాగోలు జేమ్స్ హాస్పిటల్ చే ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-రాజాం: సెంటెన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా, రాగోలు జేమ్స్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరము నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరమునకు రాజాం పరిసర ప్రాంతాల నుండి, స్త్రీలు, పురుషులు అనేకమంది శిబిరానికి వచ్చి ఉచితంగా తనిఖీలు చేసుకోవడం జరిగినది. ఈ వైద్య శిబిరమునందు రాగోలు జేమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జి. కీర్తి, డాక్టర్ ఎం.ప్రసన్న తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించినటువంటి వారికి ఉచితముగా బిపి, షుగరు తనిఖీలు చేయడం జరిగినది. ఈ యొక్క వైద్య శిబిరాన్ని వైయస్సార్సీపి రాజాం నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్. తలే రాజేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సెయింట్ ఆన్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిస్టర్. సుదీప, సెయింట్ ఆన్స్ శ్రీ శక్తి మాక్స్ డైరెక్టర్. సిస్టర్ హిల్డా,పి ఆర్ ఓ.ఎస్ శ్రీరామ్,ఏరియా మేనేజర్ ఏ. అబ్రహం,అసిస్టెంట్ మేనేజర్ ఎం. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

విజయనగరం

పార్వతీపురం మన్యం

సోమవారం 5, ఫిబ్రవరి 2024

సెంటెన్స్ శ్రీ శక్తి ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

విశాలాంధ్ర-రాజాం : సెంటెన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా, రాగోలు జేమ్స్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరము నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరానికి రాజాం పరిసర ప్రాంతాల నుండి అనేకమంది శిబిరానికి వచ్చి ఉచితంగా తనిఖీలు చేసుకోవడం జరిగినది. ఈ వైద్య శిబిరమునందు రాగోలు జేమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జి. కీర్తి, డాక్టర్ ఎం.ప్రసన్న తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించినటువంటి వారికి ఉచితముగా బిపి, షుగరు తనిఖీలు చేయడం జరి గింది. వైద్య శిబిరాన్ని వైసీపి రాజాం నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్. తలే రాజేష్ ప్రారం భించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సెయింట్ ఆన్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిస్టర్. సుదీప, సెయింట్ ఆన్స్ శ్రీ శక్తి మార్క్స్ డైరెక్టర్. సిస్టర్ హిల్డా,పి ఆర్ ఓ.ఎస్ శ్రీరామ్,ఏరియా మేనేజర్ ఏ. అబ్రహాం,అసిస్టెంట్ మేనేజర్ ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కేన్సర్ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పీఎంపీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరి రామయ్య పంతులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని కోట కూడలి వద్ద రామయ్య పంతులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కేన్సర్ వ్యాధులు పెరిగిన కారణంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రి ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుబాటులో కేన్సర్ ఆసుపత్రి లేక రోగులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పాదచారులకు, వాహన చోదకులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎన్.బి.రాజు, కె.ఎస్.ఎన్.మూర్తి, ఆర్.ప్రసాద్, ఈశ్వరరావు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై శిక్షణా తరగతులు

బీసీ వెల్ఫేర్ సహాయ అధికారి ఎం.యశోదనరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, ధర్మవరం జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో విజయనగరం రూరల్ పరిధిలో గల హాస్టళ్లలో ఉంటూ 10వ తరగతి చదువుతున్న వెనుకబడిన తరగతుల విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత, మెలకువలపై ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమాధికారి ఎం.యశోధనరావు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు త్వరలోనే జరగనున్నందున విద్యార్థులు ఇతర విషయాలను పక్కన పెట్టి చదువుకోవడంపై పూర్తిగా దృష్టి సారించాలని సూచించారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు వ్రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం హైస్కూలు హెచ్.ఎం ఉమామహేశ్వరరావు, వసతిగృహ సంక్షేమాధికారులు జి.చంద్రమౌళి (జొన్నవలస), ఆర్.సత్యనారాయణ (ఎస్.కోట), నీరజాకుమారి (కొత్తవలస), టీఎస్ఆర్ శర్మ (గంట్యాడ), బీఏఎన్ శ్రీధర్ (గజపతినగరం), డి.అనూరాధ (చీపురుపల్లి), బి.చంద్రినాయుడు (బోనంగి), ఎం.పద్మిని (దేవుపల్లి), ఎస్. గౌతమి (ఎస్.కోట), పి.కన్నబాబు (కలవచర్ల) పాల్గొన్నారు.

వీడియో సాంగ్ ను ఎంపీ బెల్లాన చే ఆవిష్కరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : జవహర్ బాల భవన్ విద్యార్థినిలు రూపొందించిన గోవిందా గాడితో బూరి బుగ్గల రమణమ్మ వీడియో సాంగ్ ను విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్(పెదబాబు) ప్రారంభించారు. చీపురుపల్లి లో గల ఎంపి క్యాంప్ కార్యాలయంలో జవహర్ లాల్ బాల భవన్ విద్యార్థినిలు రూపొందించిన గోవింద గాడితో బూరి బుగ్గల రమణమ్మ వీడియో సాంగ్ ను ఎంపీ బెల్లాన లాంచ్ చేశారు. ఎంపీతో పాటూ ఎంపీటీసీ కోసిరెడ్డి రమణ విద్యార్థినిలు,బాల భవన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు వాసవీమాత వెండి ప్రతిమలు పంపిణీ

విశాలాంధ్ర- శృంగవరపుకోట : మండలంలోని సంతగైరమ్మపేట దరణేశ్వరీస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సీతంపేట వాసవీ క్లబ్ సమావేశంలో 41మందికి వాసవీమాత వెండి ప్రతిమలను సంఘ ఆధ్యక్షుడు కుసుమంచి నానాజీ, జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా సంఘ గవర్నర్ మాట్లాడుతూ వాసవీపుత్రులు అంతా సంఘ సేవలో పాల్గొనాలని, వైద్యారోగ్య సేవా కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.రాజు,పి.శ్రీను, హరి, సర్వదేముళ్ల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబుకే ఓటు వేయాలి

పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు వేమలి చైతన్య బాబు క్లస్టర్ ఇంచార్జ్ ప్రదీప్ కుమార్ లు పిలుపు

విశాలాంధ్ర-గజపతినగరం: రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబుకే ఓటు వేయాలని పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు వేమలి చైతన్య బాబు క్లస్టర్ ఇంచార్జ్ ప్రదీప్ కుమార్ లు పిలుపునిచ్చారు ఆదివారం గజపతినగరంలోని టిడిపి కార్యాలయంలో మై ఫస్ట్ ఓటు ఫర్ సిబిఎన్ అనే గోడ పత్రికను విడుదల చేశారు ముఖ్యంగా తొలిసారిగా ఓటు వేస్తున్న వారు కుల మతాలకు అతీతంగా చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలని కోరారు టిడిపి నేతలు అట్టాడ లక్ష్మీ నాయుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతా.. డోంట్ కేర్..!

ఎన్నికలకు సిద్దమైన ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి

అధిష్టానం ఆదేశాలమేరకు అంటూ ఎన్నికల కార్యాలయం ఏర్పాటు

అంతా పెద్దలే చూసుకుంటారనే ధీమా



విశాలాంధ్ర-జామి: ఆయన అందరిలాంటి నాయకుడు కాదు. లోపల మనసులో ఒకటి, బైటకు మరొకలా ప్రవర్తించలేరు. తనను అభిమానించే వారికి ఆయనంటే ఏమిటో తెలుస్తుంది. శత్రువుగా చూసే వారిని కలుపువెళ్ళేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తునే ఉంటారు. అది అతని వ్యక్తిత్వం. ఆయన మన ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు. గత ఎన్నికలలో ఎవరూ ఊహించని విదంగా ఎస్‌కోట టిక్కెట్ తెచ్చుకోవడంతోపాటు గెలవడం కూడా ఆశ్చర్యకరమైన రీతిలో జరిగిపోయింది. ఈసారి ఎన్నికలు అంత ఆషామాషీకాదు. అయినా తాను చేసిన కృషిని, రాష్ట్రంలోని జగన్ సర్కార్ అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఆయనకు పూర్తి స్థాయిలో నమ్మకం ఉంది. అదే నమ్మంకంతో వచ్చేఎన్నికలకు సిద్దమవుతున్నారు.

మరి అసమ్మతి సంగతేంటి..?

ఎమ్మెల్యేకు మరోసారి అవకాశమిస్తే తాము సహకరించమని పలు మండలాలలో ఇప్పటికే కొందరు నేతలు బాహాటంగా ప్రకటించారు. అయితే కడుబండి మాత్రం ఈఅసమ్మతిని పట్టించు కోవడం లేదు. అధిష్టానం వద్దకు టిక్కెట్ కావాలని అనేకమంది వెళతారని, అందులో తప్పేమి లేదని అన్నారు. నాధీమా మేరకు నేను పనిచేసుకు పోతున్నానని తెలిపారు. ఇప్పటికే కొత్తవలసలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని, కాల్‌సెంటర్‌ను ప్రారంభించడం జరిగింది. ఇక స్థానికత అంశంపై నియోజకవర్గంలో ఎంత దుమారం లేచినా అధిష్టానం పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. కడుబండి ఇప్పటికే నియోజకవర్గంలో ఏనేతకు లేనంత భారీ భవనాన్ని నిర్మించుకుని కొత్తవలసలో అందరికీ అందుబాటులో నివాసముంటున్నారు. నిత్యం ప్రజలు,నేతలతో ఆయన గడుపుతున్నారు. దీంతో ఆయనకు ఈస్థానికేతరుడు అనే పదం వర్తించదని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు. ఇక టిక్కెట్ విషయంలో ఏనాడు చర్చించని కడుబండి అంతా పైనున్న పెద్దలే చూసుకుంటారనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే అంతా సద్దుమణుగుతుందని చెబుతున్నారు.

వెలమలకు ఎమ్మెల్యే.ఎంపీ సీట్లు కేటాయించాలి

ఏపి వెలమ సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు లగుడు గోవిందరావు

విశాలాంధ్ర-మెంటాడ : రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం 5 పార్లమెంట్, 25 అసెంబ్లీ సీట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. మెంటాడ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో 50 లక్షలు పైబడి ఉన్నటువంటి వెలమసామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మొన్న వైకాపా పార్టీ విజయనగరం, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాలు కాపు సామాజిక వర్గం కేటాయింపు పై పునరాలోచన చేయాలని అన్నారు. ఒకే సామాజిక వర్గానికి రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించడం సబబు కాదని, ఆ యొక్క నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు.ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘంనకు విశాఖపట్నంలో రెండు ఎకరాలు స్థలం కేటాయించాలని, వెలమ సామాజిక వర్గాన్ని బి సి డి జాబితా నుంచి బి సి ఏ జాబితాలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లాల రాష్ట్ర నాయకులు బర్ల పైడం నాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, పి మల్లయ్య దొర, బోడంకి రమణ, మంత్రబుద్ది అనంత కుమార్, కరక రమణ,కొరుపిల్లి పరశు నాయుడు, మరిశర్ల కిషోర్ కుమార్, తెంటు రామారావు పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలు కేంద్రం వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్ డిమాండ్ చేశారు ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మా పిసిసి అధ్యక్షులు షర్మిల ఈనెల రెండవ తేదీన ఢిల్లీలో ప్రత్యేక హెూదాపై నిరసన తెలపడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా ఆమె ఆదేశాలతో ఆదివారం పట్టణ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను విభజించినప్పుడు విభజన హామీలు ఏవైతే ఉన్నాయో వాటిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి వెంకన్న సాక్షిగా ఒప్పుకొని ఇప్పుడు మొండి చేయి చూపిస్తున్నారని అన్నారు ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి, కడప స్టీల్ ప్లాంట్, విశాఖపట్నం రైల్వే జోన్ వంటి పొలం అంశాలు విభజన హామీలను నెరవేర్చకుండా ఆంధ్ర ప్రజలతో మోసపూరిత హామీలను ఇస్తుందన్నారు. రానున్న రోజుల్లో కేంద్రాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ చైర్మన్ చింతపల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శనమనేటి శ్రీనివాసరావు, మండల పార్టీ నాయకులు దుప్పాడ సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చాం డ్వాక్రా రుణాలు తీర్చాం

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-వంగర: ఎన్నికల్లో హామీల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.ఆదివారం వంగర హై స్కూల్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ఆసరా నాల్గవ విడత సంబరాల్లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు బాగుంటే ఆ ఇల్లు సస్యశ్యామలంగా ఉంటుందని, భారతదేశం లో స్త్రీ కి ఒక ప్రత్యేక గొప్పతనం ఉంటుందని అన్నారు. ఈ ఐదేళ్లలో జగన్ పరిపాలనలో మంచి పరిపాలనను అందించిన జగన్ మోహన్ రెడ్డిని, మరలా ఆయన్నే సీఎం చేయాలని, మీరందరూ రానున్న ఎన్నికల్లో ఫాన్ కుఓటువేసి హిపించాలని ఆయన కోరారు.చంద్ర బాబు నాయుడు మోసపు మాటలను నమ్మవద్దని ఆయన కోరారు.కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారం దక్కించుకోవడానికి అనేక మాయమాటలు చెబుతున్నారని, ఆమోసపు మటలు నమ్మి మోసపోవద్ద ని కోరారు. సామాజికంగా నూ ఆర్థికంగానూ వెనుకబడిన తరాలను ముందుకు తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి మాత్రమే దక్కుతుందని అయన వివరించారు. నామినేటెడ్ పదవులలో నూటికి యాభై శాతం మహిళలకే ఇచ్చారని ఆయన కొనియాడారు. సంక్షేమ పథకాలను కుల మత బేదాలు, పార్టీల కతీతంగా అందించామని,ఈ పథకాలు అమలు విషయంలో కూడా ప్రథమ పాత్ర వైసిపి ప్రభుత్వం మహిళల కే ఇస్తుంద ని ఆయన స్పష్టం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎస్సీ, బిసి మైనార్టీలు పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఇంగ్లీష్ విద్య అందుతుందనీ,గతంలో టిడిపి ప్రభుత్వంలో తెలుగు భాష కూడా సరిగా చెప్పలేని పరిస్తితి ఉండేదని ప్రతి ఒక్కరికీ చదువు అందించే బాధ్యత ముఖ్యమంత్రి తీసుకున్నారని అయనఅన్నారు. మేము గడప గడప కార్యక్రమంలో మీ ఇళ్లక?ఇళ్లకు వచ్చే సమయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పై మంచి స్పందన వచ్చిందని, రాష్టానికి జగన్ మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి అవుతారన్నారు. రాష్ట్రంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సేవ, దానగుణం కలిగి ముఖ్యంగా అన్ని వర్గాలను కలుపుకునే వ్యక్తి ఈ రాష్టంలో వున్నారంటే అది ఒక మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని అయన పేర్కొన్నారు.రాబోయే కాలంలో పేద వారికి న్యాయం జరిగి సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్రెడ్డి ప్రభుత్వం అధికారం లోకి రావాలని,దీనిని మీరు గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రజలకుఇంత మంచి వ్యక్తి మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటం మనం అదృష్టంగా భావించాలని అయన అన్నారు. పేద ప్రజలు వైద్య చేసుకోలేరని,దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారాన్నారు. ఐదు లక్షల వరకూ ఉచిత వైద్య సేవల పొందటానికిఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. దీనిని చంద్రబాబు నాయుడు వచ్చి నిర్వీర్యం చేశారన్నారు.మన జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఆయన తరువాత ఈ కార్యక్రమానికి ప్రవేశ పెట్టీ,ఈ నిధులతో కార్పొరేట్ వైద్య సేవలు పేదలకు అందలేదని,ఇపుడు రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు అందించటానికి చర్యలు చేపట్టారాన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్ల మెంట్ సభ్యులు బెల్లానా చెంద్రశేఖర్ మాట్లాడుతూ మన రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి పదంలో నడుస్తుంది అని ఆయన వివరించారు.ఆనాడు ఆయన పాదయాత్ర చేసేటప్పుడు ఏదైతే మాట ఇచ్చాడో మాట నిలబెట్టుకున్న వ్యక్తిగా జగన్మోహన్ రెడ్డి పని చేశారని వివరించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎం ఎల్ సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అమ్మఒ డి, గోరు ముద్ద,విద్యాదీవెన,విదేశీ విద్య, చేయూత తదితర పథకాలు పేదలకు అందించిన ఘనత ముఖ్యమంత?పథకాలు పేదలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి దే నన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజాం వైసీపీ ఇంచార్జీ తలే రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రం లో పేదల సంక్షేమమే పరమావిధిగా పనిచేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డన్నారు. అవినీతి కి తావు లేకుండా పనిచేశారన్నారు. నేను రాజాం అసెంబ్లీ స్థానం లో వైసీపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను. మీరందరూ నాకు ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అవినీతి జరగకుండా నేరుగా ఏ సంక్షేమ పథకం అయినా ప్రజలకు నేరుగా అందే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేశారని వివరించారు. వంగ ర మండలంలో గల 772 మహిళా సంఘాల కు నాల్గవ విడత నిధులు రూ.5.72 కోట్ల జమ చేసినట్లు వివరించారు. నాలుగు దఫాలుగా రాష్ట్రం మొత్తం పైన మహిళా గ్రూపులకు రూ.26 వేల కోట్లు మహిళలకు జమ చేసి ఆర్థికంగా ఎదగటానికి దోహద పద్మావి చైర్మన్ శ్రీనువాసరావు,తదితరులు వివరించారు.ఈ కార్యక్రమానికి ఎంపీపీ సురేష్ ముఖర్జీ అధ్యక్షత వహించగా, ఈ కార్యక్రమంలో మండల పరిధిలో ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, పి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు, జె.సి.ఎస్.కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సోషల్ మీడియా కన్వీనర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ రెండు ఆలయాలకు నిధులు మంజూరు

చురుగ్గా కాశాపేట రామాలయం, నిడగల్లు ఈశ్వరాలయం పనులు

ఒక్కో ఆలయానికి 40లక్షలు కేటాయించిన దేవాదాయ ధర్మాదాయశాఖ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని కాసాపేట, నిడగల్లుగ్రామాల్లో ఆలయాల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆయాగ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిదులు,నాయులు, భక్తులు కూర్చొని కమిటీలను ఏర్పాటు చేయగా, వారిఆధ్వర్యంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కాసాపేట గ్రామం మధ్యలో నిర్మిస్తున్న శ్రీరామాలయం పనులు చివరిదశకు చేరుకున్నాయి. ఈనెల 12 నుండి ప్రతిష్ట ఉత్సవాలను ఘనంగా చేయడానికి కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు సర్పంచ్ తేలు సత్యం మాస్టారు తెలిపారు. ఆయనే దగ్గరుండి ఆలయ నిర్మాణ పనులు చేయిస్తున్నారు. దీంతోపాటు మండలంలోని అతి పురాతన దేవాలయంగా పేర్గాంచిన నిడగల్లు శ్రీనీలకంటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. ఈరెండు గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిదులు, పెద్దలవిజ్ఞప్తి మేరకు పార్వతీపురం ఎమ్మెల్యే అలజింగి జోగారావు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖకు ప్రతిపాదనలు పంపారు. దీంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ గా ఉన్న హరి జవహర్ లాల్ (అప్పట్లో ఉమ్మడి విజయనగరంజిల్లా కలెక్టరు గా పనిచేసినఅధికారి) వెంటనే రెండు ఆలయాలకు 40లక్షల రూపాయల చొప్పున మంజూరుచేస్తూ తగు అదేశాలు జారీచేశారు. దీనిలో కొంత ప్రజల బాగస్వా మ్యాన్ని కూడాచేర్చి ఆదేశాలు జారీచేశారు. దీంతో ఈరెండు గ్రామాల్లోని కమిటీ సభ్యులు కూడా చురుగ్గా పనులు చేయించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఒక్కో ఆలయం పరిదిలో చేసిన పనులకు రూ.13.5లక్షల వరకు డబ్బులు కూడా విడుదల అయ్యాయని రెండు గ్రామాల కమిటీ సభ్యులు తెలిపారు.ఆదివారం విశాలాంధ్ర పత్రిక రిపోర్టర్ అయా గ్రామాలకు వెళ్లినపుడు పనులు చురుగ్గా జరుగుతున్నట్లు కనిపించింది. ఆలయాలకు ప్రభుత్వం తరుపున నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే జోగారావుకు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతోపాటు గ్రామానికి చెందిన ప్రజలు కూడా పెద్ద ఎత్తున విరాళాలు అందజేయడంతో ఆధునీకరణ పనులు చేస్తామని చెప్పారు. ఇప్పటికే మండలంలోని చిన్నారాయుడుపేట గిరిజనగ్రామంలో రామాలయం లేని గ్రామంగా టీటీడీ గుర్తించి టీటీడి ఆధ్వర్యంలో 10లక్షల రూపాయలతో రామాలయాన్ని నిర్మించి ప్రారంభాన్ని చేశారని సర్పంచ్ సాంబన్నదొర తెలిపారు.

ఎస్.కోటలో 186వ రోజు అన్నక్యాంటీన్

నిత్య అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంతో శృంగవరపుకోట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట, పుణ్యగిరి రోడ్డులో మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు, కోళ్ల పైడితల్లమ్మ దంపతుల ఆశీస్సులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ నిర్విరామముగా శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి 186వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా ఆదివారం మధ్యాహ్నం వచ్చిన 300 మంది పేదవారికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉచితంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మండల మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ ఇంఛార్జ్ అనకాపల్లి చెల్లయ్య,క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, రొంగలి రమణ, భుత్తల సన్యాసిరావు, గోపి, శ్రీను, జనార్దన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల కమిటీ సభ్యునిగా డాక్టర్ హేమ నాయక్

విశాలాంధ్ర-బెలగాం : ప్రముఖ సామాజికవేత్త, వైద్యుడు, భారతీయ జనతా పార్టీ సభ్యుడైన డాక్టర్ హేమ నాయక్ ను కేంద్ర ప్రభుత్వ పథకాల అరకు పార్లమెంటరీ లబ్ధిదారుల కమిటీ సభ్యునిగా నియమిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరీ ప్రకటించారు. ఆయన ఆదివారం పార్వతీపురం విచ్చేసిన సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తాను చేస్తున్న సేవలను, గిరిజనుల పట్ల తనకున్న అంకిత భావాన్ని గుర్తించి బిజెపి నాయకులు తనకు ఇచ్చిన ఈ గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందని కానీ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుల వలన ఆంధ్రప్రదేశ్ లో ఇంకా కొన్ని ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తమ నాయకులు ఫోటోలు వేసుకొని, తమ పార్టీ ముద్రలు వేసుకొని సొంత డబ్బా కొట్టుకుంటుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందరికీ అందేటట్టు చేయడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికీ మారుమూల, కొండ శిఖర గ్రామాలలో పథకాలు అందని లబ్ధిదారులు ఎంతోమంది ఉన్నారని ఆరోపించారు. తాను వైద్యుడిగా అరకు పార్లమెంటరీ ప్రాంతంలోని గిరిజన ప్రాంతాలలో పర్యటించి వారి సాధక బాధలు ఎన్నో తెలుసుకున్నానని తన వంతుగా ఇక్కడి గిరిజన ప్రాంతాల స్థితిగతులను నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానన్నారు. తన బాధ్యతగా ఇక నుండి ప్రతి గ్రామాల్లో, పథకాల లబ్ధిదారుల చివరి ప్రాంతం వరకు తిరుగుతూ వారికి అన్ని పథకాలు అందేటట్లు చూస్తానన్నారు. ఈ ప్రాంతానికి చెందిన గిరిజనుడుగా ఇది తన బాధ్యత అని అన్నారు. ఈ గురుతర బాధ్యత తనపై పెట్టిన బిజెపి నాయకులు తపన చౌదరి, పరుశు రామరాజు, మన్యం జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజాం నియోజకవర్గ దివ్యాంగుల సర్వసభ సమావేశం

విశాలాంధ్ర-రాజాం: శ్రీ విజయదుర్గా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజాం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో సభ్యుల అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి చర్చించడం జరిగింది.సమావేశం లో అధ్యక్షులు కొండబాబు, ఇతర నాయకులు,నాలుగు మండలాలకు చెందిన నాయుకులు దివ్యాంగులు పాల్గొన్నారు.